మినీకథ

# సింగిల్ రెడ్ డబుల్ వైట్

సంగాపు వెంకట కోటేశ్వరరావు



బస్ స్టాప్‌లో బస్‌కోసం వెయిట్ చేస్తున్నారు. సకాలానికి రాని బస్సులపై నాకు మనస్సులో కించిత్ కోపం రాకపోలేదు. బస్‌కోసం అసహనంగా ఎదురుచూడడం తప్ప చేసేదిలేక పోయింది.

''ఏవోయ్ రామం బావున్నావా'' అంటూ ఎవరో నాపై చేయి వేయడంతో వెనుదిరిగి చూశాను. ఎదురుగా రామానుజాచార్యులు మాష్టారు.

''నమస్కారం మాష్టారూ, బావున్నారా'' అన్నాను పలకరింపుగా

''బాగానే వున్నానోయ్, ఏం చేస్తున్నావిప్పుడు''

''బాంక్‌లో ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నానండీ''

''పెళ్ళి..గట్రా..ఏమైనా''

''ఆ, పెళ్ళయి రెండేళ్ళయిందండి. ఒక పాప కూడాను.''

''శభాష్'' అన్నారాయన నా భుజం తడుతూ. మేం కాలేజీలో చదివే రోజులలో మాకు తెలుగు సబ్జక్టుకు వచ్చేవారు. ఆయన తెలుగు పాఠం చెబుతే వంక పెట్టాల్సిన పనుండేదికాదు. 'సరస హృదయులు', 'సంభాషణాచతురులు' అని అప్పట్లో ఆయనకు టైటిల్స్. మొత్తానికి మంచి కాలక్షేపమే దొరికిందనిపించింది నాకు. ఓ పావు గంటసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాము.

''నిన్నో ప్రశ్నడుగుతా సమాధానం చెబుతావుటోయ్'' అన్నారాయన మాటల మధ్యలో వున్నట్లుండి. చదువుకునే రోజులలో క్లాస్ రూంలో మాపై ప్రశ్నల వర్షం కురిపించి ముప్పతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించే వారాయన.

''మనదేశం పేరేమిటోయ్''

''భారతదేశం''

''భారతదేశానికి ఆ పేరెట్లు వచ్చింది''

''భరతుడనే రాజు పరిపాలించడం వలన''

''భరతుడెవరు?''

''శకుంతలా దుష్యంతుల కుమారుడు''

''ఇప్పుడు మనం దుష్యంతోపాఖ్యానంలోని కొన్ని పద్యాలు చదువుకుందాం''

ఈ విధంగా వుండేది ఆయన ప్రశ్నాపరంపర. 'మొత్తానికి ఇక్కడకూడా మాష్టరు బుద్ధి పోనిచ్చుకున్నారుకారు' అనుకున్నాను మనస్సులో.

''ఏమిటది మాష్టారూ!!'' ఆశ్చర్యంగా అడిగాను.

''సింగిల్ రెడ్ డబుల్ వైట్'' అంటే ఏమిటోయ్ రామం.

నా నెత్తిన పిడుగు పడ్డంత పనయింది. గతం మళ్ళీ ఓసారి గుర్తొచ్చింది. కాలేజీలో నాకో ప్రత్యేకత వుండేది. 'నిక్ నేమ్స్' పెట్టడంలో సిద్ధహస్తుణ్ణి. క్లాస్ రూంలో గొడవ చేసినా బాగా చదవడం వలన నాపై అందరికి ఓ ప్రత్యేకమైన సదభిప్రాయం వుండేది. 'సింగిల్ రెడ్ డబుల్ వైట్' రామానుజాచార్యులు మాష్టారి నిక్‌నేమ్. ఆయనకా నామకరణం చేసింది నేనే.

''ఇప్పుడవన్నీ ఎందుకులే మాష్టారూ... ఆకతాయి తనం...తెలిసీ తెలియని వయస్సు... మిడిమిడి జ్ఞానం'' అన్నాను ముఖానికి నవ్వు పులుముకుంటూ. ఆయన్ను మాటల్లోపెట్టి టాపిక్ మార్చాలని చేసిన నా ప్రయత్నం విఫలమే అయింది.

''మరేం ఫర్వాలేదులేవోయ్. అప్పట్లో నేనే అడుగుదామనిపించేది. అభిమానం అడ్డొచ్చి ఆగిపోయేవాణ్ణి. ఇవాళ ఆ రహస్యమేమిటో చెప్పితీరాల్సిందే'' అన్నారాయన నా వంక అదోలా చూస్తూ.

ఇక చెప్పక తప్పింది కాదు నాకు.

''మరేం లేదు మాష్టారూ, మీరు రోజూ పంగనామాలు పెట్టుకొచ్చేవారు కదా''

''అవునూ...ఆ... అయితే'' అర్థంకానట్టు నావంక చూసి, నే చెప్పేది ఆసక్తిగా వింటున్నారు.

''మీరు పెట్టుకొచ్చే పంగనామాల్లోని మధ్య వున్న ఎర్రగీతను 'సింగిల్ రెడ్' అనీ, ఇరువైపులా వున్న రెండు తెల్లగీతలను 'డబుల్ వైట్' అనీ, వెరసి, 'సింగిల్ రెడ్ డబుల్ వైట్' అనీ నిక్ నేమ్ పెట్టేశాం.''

నా ప్రమేయం లేకుండానే వచ్చేసింది నవ్వు.

'ఓర్నీ...' నా భుజంపైన తట్టి, నా నవ్వులో శృతి కలిపేశారాయన. మా నవ్వులకు బ్రేక్ వేస్తూ వచ్చి ఆగింది నేనెక్కవలసిన బస్సు.

''వెళ్ళొస్తాను మాష్టారూ''

మాష్టారు దగ్గర సెలవు తీసుకొని బస్సెక్కాను. బస్సు కదిలింది రాకెట్‌లా.